సాక్షి
జోగులాంబ గద్వాల

శనివారం । 10 । ఆగస్టు । 2024



జూరాలకు వరద..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద జోరు తగ్గడం లేదు.

వివరాలు 8లో ▸



ప్రజలకు చేరువ..

ఆర్టీసీ సేవల ద్వారా ప్రజలకు చేరువవుతూ ఆదాయం పెంపునకు కృషిచేస్తోంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.4/25.2

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

సదరం క్యాంపుల షెడ్యూల్‌ విడుదల

గద్వాల న్యూటౌన్‌: జిల్లాలో ఆగస్టు నెలలో నిర్వహించే సదరం క్యాంపుల ప్రణాళికను డీఆర్‌డీఓ నర్సింగరావ్‌ విడుదల చేశారు. 13, 20, 27వ తేదీల్లో కంటి, శారీరక మానసిక వికలత్వం ఉన్నవారికి, 14, 21, 28వ తేదీల్లో శారీరక వికలత్వం ఉన్నవారికి, ఆగస్టు 9, 16, 23, 30వ తేదీల్లో చెవిటి, మూగ వికలత్వం ఉన్న వారికి సదరం క్యాంపులు ఉంటాయని తెలిపారు. వికలంగత్వ నిర్ధారణ పరీక్షలు, సర్టిఫికేట్‌ రెన్యూవల్‌ కోసం అర్హులైన దివ్యాంగులు సదరం క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంటాయని, హాజరు కావాల్సిన వారు ముందుగా మీ–సేవా కేంద్రాల్లో స్లాట్‌ బుకింగ్‌ చేసుకోవాలని సూచించారు.

చదువులో ముందడుగు వేయాలి

గద్వాల క్రైం: విద్యార్థులు చదువులో ముందడుగు వేయాల్సిందిగా ప్రిన్సిపల్‌ సీనియర్‌ సివిల్‌ జడ్జి గంట కవితాదేవి అన్నారు. శుక్రవారం ఆదివాసిల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. కులం, మతం అంటూ విద్యార్థులు ఒకరిపై ఒకరు విద్వేషాలు తెచ్చుకోవద్దన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దిక్సూచిగా నిలవాలన్నారు. పలు చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో పవన్‌కుమార్‌, శివ ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కుంకుమార్చన పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆద్వర్యంలో కుంకుమార్చన పూజలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లాకేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రిజ్‌, డిష్‌వాషర్‌, ఏసీ, మైక్రో ఓవెన్‌, వాటర్‌ ఫిల్టర్‌ తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల 18– 25 ఏళ్లలోపు యువత ఈ నెల 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పుర ఆదాయానికి గండి

మున్సిపల్‌ వ్యాపార సముదాయాలపై కొరవడిన పర్యవేక్షణ



గద్వాలలోని మున్సిపల్‌ దుకాణ సముదాయం

- రూ.92 లక్షల అద్దె బకాయిలు
- దుకాణాలు పొందిన వారు ఇతరులకు అధిక అద్దెకు ఇస్తున్న వైనం
- రాజకీయ జోక్యంతో రాబడి ఆర్జించలేని స్థితిలో మున్సిపాలిటీలు

గద్వాల: 'స్థలం మనది.. ఇల్లు కట్టుకునేది మన సొమ్ములతో.. కానీ ఇంటి స్థలానికి లేఅవుట్‌ అనుమతి ఉండాలి. ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకోవాలి. కనీసం లేఅవుట్‌ లేకపోయినా భూమి మార్కెట్‌ ధరపై 14 శాతం అపరాధ రుసుం వసూలు చేస్తారు. అనుమతి లేకుండా ఇల్లు కట్టుకుంటే ఆస్తిపన్ను రెట్టింపు విధిస్తారు. అన్ని అనుమతులు తీసుకొని ఇల్లు కట్టుకున్నా ఏటా ఆస్తిపన్ను చెల్లించాలి. ఇది మన సొంత ఆస్తికి సంబంధించిన వ్యవహారం.' కానీ ఇవేవీ లేకుండా దర్జాగా ఆస్తులను అనుభవించాలనుకుంటే మాత్రం మున్సిపాలిటీలకు చెందిన ఆస్తులు (వ్యాపార సముదాయాలను) వెతుక్కోవాలి. ఒక్కసారి వేలంలో పాల్గొని సముదాయంలో ఒక్క దుకాణం పొందితే చాలు మొదట కొంత సొమ్ము విదిల్చుకుంటే ఇక ఆ ఆస్తిని అనుభవించడానికి హక్కులు పొందినట్లే. అద్దెలు అడిగేవారుండరు.. అడిగినా మనకు తెలిసిన నాయకులను ఆశ్రయిస్తే సరిపోతుంది. గద్వాల మున్సిపాలిటీలోని వ్యాపార సముదాయాల్లో జరుగుతున్న తంతు ఇది. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే మనరులుగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వ్యాపార సముదాయాలు పరులపాలవుతున్నాయి. మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతుండగా, దుకాణాలను పొందిన వ్యక్తులు వాటిని ఇతరులకు అద్దెకిస్తూ ఆర్జిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార సముదాయాల్లో నిబంధన ఉల్లంఘన అడుగడుగునా చోటుచేసుకుంటున్న విషయం అధికారులకు తెలిసినా నోరు మెదపడం కానీ...అద్దె వసూలు చేయాలనే సాహసంతో ఒక్క అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. రాజకీయ జోక్యం సొంత ఆస్తులపై రాబడిని ఆర్జించలేని స్థితిని మున్సిపాలిటీకి కల్పిస్తుంది.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో గద్వాలతో పాటు అయిజ, అలంపూర్‌, వడ్డేపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే మూడు దశాబ్దాల క్రితం ఐడీఎస్‌ఎంటీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ రుణంతో గద్వాల మున్సిపల్‌ పరిధిలో 236 దుకాణాలను చేపట్టారు. ఏ నుంచి హెచ్‌ బ్లాక్‌ వరకూ.. స్పోర్ట్స్‌ అకాడమీ, నల్లకుంట కాలనీ, కూరగాయల మార్కెట్‌ దగ్గర, పాత బస్టాండ్‌, మున్సిపల్‌ కార్యాలయం పక్కన, కళాశాల మార్గంలో ఉన్న ప్రధాన రహదారుల పక్కన దుకాణాలను నిర్మించారు. కొన్ని దుకాణ సముదాయాలకు 30 ఏళ్ల లీజు అగ్రిమెంట్‌ పూర్తయింది. కేటాయించిన దుకాణాల అద్దెలను ప్రతి మూడేళ్లకు రెన్యూవల్‌ చేయాలి. కానీ అద్దెలను మాత్రం ప్రతి మూడు సంవత్సరాలకు పెంచకుండా తక్కువ మొత్తంలో అద్దెలు చెల్లిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడుతున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో దుకాణాల అద్దె బకాయి రూ.92 లక్షలకు చేరుకుంది.

కొందరు దుకాణదారులు రెండు, మూడేళ్లుగా..

పాత బస్టాండ్‌ సముదాయంలో, పాత గ్రంథాలయ భవన నిర్మాణం కింద దుకాణాలను వేలం పాట ద్వారా అద్దెలకు ఇచ్చారు. భారీ మొత్తంలో వ్యాపారులు వేలం పాడి దుకాణాలను దక్కించుకున్నారు. ఇందులో చాలా మంది వ్యాపారులు దుకాణం దక్కించుకున్నప్పటి నుంచి అద్దెలే చెల్లించడం లేదు. ఈ రెండు సముదాయాలలో ఉన్న అద్దె బకాయిలే రూ.లక్షల్లో ఉన్నాయి. కొంత మంది రెండు, మూడేళ్ల నుంచి అద్దెలు చెల్లించడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అద్దె వసూళ్లకు వెళ్లిన మున్సిపల్‌ సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పెద్ద మొత్తంలో అద్దె బకాయిలు పేరుకపోతున్నాయి.

నోటీసులు జారీ చేస్తాం



మున్సిపాలిటీకి సంబంధించిన దుకాణాల అద్దె బకాయిలను వసూలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ చేపడతాం. ఇప్పటికే బకాయిలు ఎక్కువగా ఉన్న దుకాణాల తాలుకు జాబితా తయారు చేశాం. వారందరికి నోటీసులు జారీ చేస్తున్నాం. అప్పటికీ స్పందించకుంటే దుకాణాలకు తాళాలు వేస్తాం. దుకాణాల అద్దె విషయంలో కఠిన చర్యలు తప్పవు.

– దశరథ్‌, మున్సిపల్‌ కమిషనర్‌, గద్వాల

గద్వాలలో పుర షాపింగ్‌ కాంప్లెక్స్‌ల వివరాలిలా..	మొత్తం దుకాణాలు	ఏడా రావాల్సిన ఆదాయం	నెలనెల రావాల్సిన అద్దె	నెలనెల వసూలు అవుతున్న అద్దె	మొత్తం దుకాణాల అద్దె బకాయి
	236	రూ.1.13 కోట్లు	రూ.9.48 లక్షలు	30 శాతం	రూ.92 లక్షలు

ఆన్‌లైన్‌ మోసాలపై అప్రమత్తత అవసరం



ఉప్పలలో ప్రజలకు సైబర్‌ నేరగాళ్లపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అయిజ: సాంకేతికత రోజు రోజుకు కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో సైబర్‌ నేరగాళ్లు కొత్త కొత్త విధానాలతో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ విజయభాస్కర్‌ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఉప్పలలో ఆన్‌లైన్‌ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. ఎవరైనా అపరిచితులు ఫోన్‌ చేసి ప్రభుత్వ సంక్షేమాల గురించి, బ్యాంక్‌ కార్యకలాపాల గురించి నమ్మబలికి ప్రజలను మభ్యపెడితే జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌ చేస్తే అనుమానం కలిగిన వెంటనే ఫోన్‌కాల్‌ కట్‌ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీ చెప్పరాదని, లింక్‌లు కూడా ఓపెన్‌ చేయరాదని ప్రజలకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీస్‌ బృందం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఈ తేళ్లు కుట్టవు..



అరచేతిలో పట్టుకొని...



షర్ట్‌పై బటన్‌లా భలే ఉందిగా అన్నా...



చెల్లి తేలు కరవదా.. ఆసక్తిగా చూస్తున్న అన్న



కొండమవ్వ గుట్టకు బారులు తీరిన భక్తులు

నారాయణపేట జిల్లా సరిహద్దు కర్ణాటక రాష్ట్రం కందుకూరు సమీపంలోని గుట్టపై కొండమవ్వ అమ్మవారి సన్నిధిలో ప్రతి ఏటా తేళ్ల పంచమి నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న అనంతరం భక్తులు గుట్టపై రాళ్లు, మట్టి కింద ఉన్న తేళ్లను పట్టుకుని సరదాగా గడిపారు. చిన్నారులు మొదలుకొని పెద్దవాళ్ల వరకు ఎవరైనా తేళ్లను చేతుల్లో తీసుకున్నా ఎలాంటి హానీ చేయవు. అమ్మవారి మహిళ వల్లే తేళ్లు హాని చేయడం లేదని భక్తులు అంటుంటే.. గుట్టపై ఉండే వాతావరణ పరిస్థితులు, వన మూలికల కారణంగా తేళ్లు కుట్టలేకపోతున్నాయని కొందరు విద్యావంతులు చెబుతున్నారు.

– నారాయణపేట



పాపెట బిళ్ల మాదిరిగా..

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

గద్వాల: జిల్లా కేంద్రంలో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే పుట్టల చెంత చేరి నోములు నోచారు. కోర్కెలు తీరాలని పాలు పోశారు. స్థానిక శివాలయం, పీజేపీ క్యాంపు, సంతాన వేణుగోపాలస్వామి, కృష్ణమందిరం, కృష్ణానదికి వెళ్లే మార్గంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న నాగులకట్టల వద్ద భక్తుల సందడి కనిపించింది. నువ్వులు, బెల్లం, పిండి పదార్థాలను ఇళ్లలో చేసుకుని ఆరగించారు.

వేరుశనగ క్వింటా రూ.6,399

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 379 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.6399, కనిష్ఠం రూ.3441, సరాసరి రూ.4469 ధరలు పలికాయి.

పీజీ సెమిస్టర్‌ పరీక్షలు ప్రారంభం

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో పీజీ సెమిస్టర్‌–4 పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పీయూ పరిధిలోని మొత్తం 7 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పీయూలోని పీజీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్‌ మధుసూదన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మాస్‌ కాపీయింగ్‌కు పాల్పడవద్దని, చీటీలు, ఎలక్ట్రానిక్‌ పరికరాలు తీసుకు రావద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కంట్రోలర్‌ రాజ్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ చంద్రకిరణ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ కృష్ణయ్య తదితరులున్నారు.

పకడ్బందీగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ



సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్‌ అదనపు కలెక్టర్‌ నర్సింగ్‌రావు

గద్వాల రూరల్‌: త్వరలో జరిగే పంచాయతీరాజ్‌ శాఖ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా సన్నద్ధం కావాలని ఇన్‌చార్జ్‌ అదనపు కలెక్టర్‌ నర్సింగ్‌రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. గత పార్లమెంట్‌ ఎన్నికల్లో రూపొందించిన ఓటరు జాబితా ఆధారంగా గ్రామపంచాయతీ ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. టీ–పోల్‌లో గ్రామపంచాయతీ ఓటరు జాబితా నుంచి వార్డుల వారీగా మ్యాపింగ్‌ చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది ప్రణాళిక బద్ధంగా చేసేలా సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, డీపీవో శ్యాంసుందర్‌, రమేష్‌, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ లక్ష్మణ్‌

అలంపూర్‌: వ్యవసాయ లిఫ్టులు, ఇరిగేషన్‌ స్కీం రైతులకు నాణ్యమైన విద్యుత్‌ అందిస్తామని గద్వాల డీఈ లక్ష్మణ్‌ అన్నారు. అలంపూర్‌ చౌరస్తాలోని విద్యుత్‌ సబ్‌ డివిజనల్‌ కార్యాలయంలో అలంపూర్‌ నియోజకవర్గంలోని వ్యవసాయ లిఫ్టులు–ఇరిగేషన్‌ రైతులు, రైతు సంఘాల నాయకులు, కమర్షియల్‌, ఇండస్ట్రియల్‌ వినియోగదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గద్వాల డీఈ లక్ష్మణ్‌, ఏడీఈ సయ్యద్‌ చిన్న మక్బుల్‌, విద్యుత్‌ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ లిఫ్టులు, ఇరిగేషన్‌ స్కీంలకు, కమర్షియల్‌, ఇండస్ట్రియల్‌ వినియోగదారులకు అందిస్తున్న విద్యుత్‌ సరఫరా విషయమై చర్చించారు. రైతులు, రైతు సంఘాల నాయకులు, కమర్షియల్‌, ఇండస్ట్రియల్‌ విద్యుత్‌ వినియోగదారులు విద్యుత్‌ సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీటితోపాటు విద్యుత్‌ సరఫరాలో వినియోగంలో వస్తున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో రైతులు, వినియోగదారులు చెప్పిన సమస్యలను అధికారులు సానుకులంగా స్పందించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఏడీఈ మహ్మద్‌ చిన్న మక్బుల్‌, అలంపూర్‌, మానవపాడు, శాంతినగర్‌, ఎర్రవల్లి, ఉండవెల్లి మండలాల ఏఈలు, బుక్కాపురం, ఉట్కూరు, బుడ్డమర్సు, అలంపూర్‌, మారమునగాల, లిఫ్టు సంఘాల రైతులు, లిఫ్ట్‌–కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ



అలంపూర్‌లో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్‌

అలంపూర్‌: చెట్లతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని హైదరాబాద్‌ సీడీఎంఏ ప్రత్యేక అధికారి, డీఎఫ్‌ఓ అశోక్‌ కుమార్‌ అన్నారు. అలంపూర్‌ మున్సిపాలిటీలోని స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయన అలంపూర్‌ను శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో చేపట్టిన పనులను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మనోరమ, కమిషనర్‌ సరస్వతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 9వ వార్డులోని న్యూప్లాట్స్‌ కాలనీలో ఉన్న ప్రైవేటు వెంచర్‌లోని పార్కు స్థలంలో మొక్కలు నాటారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తప్పక మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. చెట్లతో పచ్చదనం పెంపొందుతుందని, స్వచ్ఛమైన గాలి, వర్షాలు బాగా కురుస్తాయన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి కాలనినీ శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే సీజనల్‌ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ శేఖర్‌రెడ్డి, ఏఈ మేఘనాథ్‌ గౌడ్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ నారయణ, వెంకటరమణ, ఆర్‌ఐ ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



పెద్దపల్లిలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి సుధారాణి

మల్దకల్‌: బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి సుధారాణి, జెడ్పీ సీఈఓ కాంతమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దపల్లి రైతు వేదికలో అంగన్‌వాడీలు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించగా వారితోపాటు స్టేట్‌ కన్సల్టెంట్‌ అధికారి నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమన్నారు. తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. వారికి ఎక్కువగా పోషకాలు ఉండే ఆహారం తీసుకునే విధంగా తెలియచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. అనంతరం స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ అంగన్‌వాడీ పరిసరాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ చెన్నయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ నాగరాణి, టీచర్లు , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రైతులను ఆగం చేశారు'



రైతు రచ్చబండలో రైతుల నుంచి సంతకాలను సేకరిస్తున్న బీజేపీ నాయకులు

గట్టు: రాష్ట్రంలో రైతులు మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతు భరోసా, రుణ మాఫీ పేరుతో కాంగ్రెస్‌ ప్రభుత్వం వారిని ఆగం చేసినట్లు బీజేపీ పార్టీ క్రమ శిక్షణా కమిటీ రాష్ట్ర కన్వీనర్‌ నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కిసాన్‌ మోర్చ ఆధ్వర్యంలో గట్టులో రైతు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని ఆరోపించారు. రైతు భరోసా, రైతు రుణ మాఫీ వంటి హామీలను సక్రమంగా అమలు చేయకుండా అన్యాయం చేసిందని, వారికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించి, న్యాయం చేసేందుకు రచ్చబండ ద్వారా రైతుల నుంచి సంతకాలను సేకరిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే బీజేపీ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రావు, బల్గెర శివారెడ్డి, భీంసేన్‌రావు, మాణిక్యరెడ్డి, గూడురు నాగప్ప, గొండ్ల నర్సింహులు, సంజీవనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి



హర్షవర్ధన్ (ఫైల్)

ఊట్కూర్: మండలంలోని పెద్దజట్రంలో శుక్రవారం నీటితొట్టిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ భీమప్ప, నందిని దంపతుల 16 నెలల బాలుడు హర్షవర్ధన్‌ను తాత బాలప్ప స్థానిక గజ్జలమ్మ గుడి దగ్గర ఆటలు ఆడిస్తూ నిద్రిపోయాడు. బాలుడు పశువులకు ఏర్పాటు చేసిన తొట్టిలో పడ్డాడు. గమనించిన స్థానికులు తొట్టిలో నుంచి బాలుడిని బయటికి తీయగా అప్పటికే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్..

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఓ డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. కర్ణాటక కోలార్ జిల్లాలోని గౌనిపల్లికి చెందిన నసీర్ (42) డీసీఎంలో పప్పు శనగల లోడ్‌తో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై మార్గమధ్యలో గురువారం అర్ధరాత్రి ముందుగా వెళ్తున్న కంటైనర్‌ను అతివేగంగా డీసీఎంతో వెనుక నుంచి ఢీకొట్టారు. ఘటనంలో ఆయన క్యాబిన్‌లో ఇరుక్కొని మృతి చెందాడు. అతడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కల్లు మత్తులో నీటిలో పడి వ్యక్తి..

గోపాల్‌పేట: కల్లుకు బానిసై మత్తులో నీటిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన రేవల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద కొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన మూగ లక్ష్మయ్య(35) అతడి భార్య పార్వతమ్మ ఆరు నెలల కిందట రేవల్లి మండల కేంద్రంలోని జానకిరాంరెడ్డి వ్యక్తి పొలంలో బతుకుదెరువుకు పని చేసుకునేందుకు వచ్చారు. లక్ష్మయ్య కొంత కాలంగా కల్లుకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో గురువారం సాయంత్రం కల్లు తాగిన మత్తులో పొలం వద్ద ఉన్న నీటి సంపులో పడిపోయాడు. కొంత దూరంలో ఉన్న తన భార్య కేకలు వేస్తూ.. సంపు వద్దకు వచ్చి అరవగా.. పక్కన ఉన్న వారు గమనించి, వెంటనే అతడిని బయటకు తీసి రేవల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. రేవల్లి ఆస్పత్రిలో అతడిని పరిశీలించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందాడని తెలియజేశారు. శుక్రవారం మృతుడి భార్య పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామని ఎస్‌ఐ వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందికి రిమాండ్

ఎర్రవల్లిచౌరస్తా: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మందిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఈ నెల 9న ఠాణా పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 14 మంది పట్టుబడగా.. అలంపూర్ కోర్టులో హాజరుపర్చినట్లు వివరించారు. అందులో 10 మందికి నాలుగు రోజుల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా.. మరో నలుగురికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు.

మహబూబ్‌నగర్‌లో 23 మందికి రూ.57, 500 జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలో గురువారం రాత్రి ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 23 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారందరిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిహారిక రూ.57,500 జరిమానా విధించారు. అనంతరం పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శంషుద్దీన్, రమేష్ పాల్గొన్నారు.



ప్రజలకు చేరువలో ఆర్టీసీ

- శుభకార్యాలకు డిపాజిట్ లేకుండా అద్దెకు బస్సులు
- అద్దెపై 10 శాతం రాయితీ



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆదాయం పెంచుకునే విధంగా ఆర్టీసీ సంస్థ ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుంది. ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం శుభకార్యాలు, పెళ్లిళ్లు, విజ్ఞాన, విహారయాత్రల రవాణాల కోసం అద్దె ప్రాతిపదికన బస్సు సౌకర్యం కల్పిస్తుంది. ఎలాంటి డిపాజిట్ లేకుండా అద్దెకు తీసుకోవచ్చు. కొన్నేళ్ల నుంచి శుభాకార్యాల సమయాల్లో చాలా మంది ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంటున్నారు.

బస్సుల వారీగా కిలోమీటర్లు

శ్రావణమాసంలో శుభాకార్యాలు, వివాహాలు ఎక్కువగా ఉన్న దృష్టా ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనుంది. పల్లె వెలుగు కిలోమీటర్‌కు రూ.66, ఎక్స్‌ప్రెస్ కిలోమీటర్‌కు రూ.69, డీలక్స్, సూపర్ లగ్జరీ కిలోమీటర్‌కు రూ.65గా నిర్ణయించారు. వచ్చేనెల 2వ తేదీ వరకు బస్సులను అద్దెకు తీసుకునేవారికి 10 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఆసక్తి గల వారు మహబూబ్‌నగర్ – 94411 62588, అచ్చంపేట- 99592 26291, గద్వాల – 99592 26290, కల్వకుర్తి – 99123 76847, కొల్లాపూర్ – 90004 05878, నాగర్‌కర్నూల్ – 83092 14790, నారాయణపేట – 99592 26293, షాద్‌నగర్-91826 45281, వనపర్తి- 99592 26289 నంబర్లకు సంప్రదించి బస్సులను బుకింగ్ చేసుకోవచ్చు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ ప్రయాణం అత్యంత సురక్షితమైనది. శ్రావణ మాసంలో వివాహాలు, ఇతర శుభాకార్యాలకు బస్సులను అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నాం. ఎలాంటి డిపాజిట్ కానీ, డ్రైవర్‌కు బత్తా కట్టనవసరం లేదు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఆర్టీసీ అందజేసే రాయితీ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి.

– శ్రీదేవి, రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

కూరగాయల సాగుపై అవగాహన

- ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు



పామిరెడ్డిపల్లి గ్రామ శివారులో రైతు నాగిరెడ్డి సాగు చేసిన మిరప తోటను పరిశీలిస్తున్న ఉద్యాన కళాశాల విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కొత్తకోట రూరల్: రైతులు సాంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై ఆసక్తి చూపితే అధిక దిగుబడి, రాబడి పొందవచ్చని మోజర్ల ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు అన్నారు. కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న దాదాపు 90 మంది విద్యార్థులు పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో రైతు నాగిరెడ్డి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సాగు చేసిన టమాట, మిర్చి, బెండకాయ, చిక్కుడు తోటల్లోకి విద్యార్థులను తీసుకెళ్లి రైతులతో మాట్లాడించారు. కూరగాయలను ఎలా పండిస్తారో రైతులు విద్యార్థులకు వివరించగా.. విద్యార్థులు చదువుకున్న యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. పశువుల ఎరువు, వేపపిండి, వర్మి కంపోస్టును పొలంలో కలియదున్నితే సారవంతంగా ఉంటాయని విద్యార్థులు రైతులకు వివరించారు. తెల్లదోమ, తామర పురుగు నివారణకు జిగురు అట్టలు ఎకరానికి 20 నుంచి 30 అట్టలు పెట్టుకోవాలని, కాయ తొల్చు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎకరాకు 10 నుంచి 12 బుట్టలు పెట్టుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జె.శ్రీనివాస్, డాక్టర్ జి.విద్య, బి.చంద్రశేఖర్ రైతులకు వివరించారు. అనంతరం అక్కడి నుంచి మల్లయ్య రైతు సాగు చేసిన గుమ్మడికాయ తోటను సైతం సందర్శించారు. వారి వెంట నాయకులు గోవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన పేట ఎస్పీ యోగేష్‌గౌతమ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

కృష్ణా: మండలంలోని కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జిపై శనివారం గుర్తు తెలియని ఓ మృతదేహం లభించింది. మృతి చెందిన వ్యక్తి మెడపై కత్తి గాట్లు ఉండడంతో హత్య చేశారని పోలీసులు నిర్ధారించారు. దీనిపై కృష్ణా ఎస్‌ఐ నవీద్, మక్తల్ సీఐ చంద్రశేఖర్‌లు నిందితులను గుర్తించి కేసును ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించిన శుక్రవారం ఎస్పీ యోగేష్‌గౌతమ్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహేష్(38) కర్ణాటకలోని రాయచూర్ జిల్లా జాగీర్ వెంకటాపురంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఈయనకు 2009లో లక్ష్మితో వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఈ క్రమంలోనే మహేష్ మరో వివాహం చేసుకునేందుకు భార్యను హత్య చేసి జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో ముగ్గురు పిల్లలను కర్ణాటకలోని ఖాదర్‌గుండులో ఉంటున్న మేనమామ కృష్ణ వద్ద ఉన్నారు. మహేష్ ఇటీవల జైలు నుంచి విడుదలయ్యాడు. మహేష్ మళ్లీ పెళ్లి చేసుకుంటానని అనడంతో ఆయన బావమరిది కృష్ణా పిల్లలకు ఆస్తి ఇవ్వాలని అడగడంతో, ఇద్దరు మగ పిల్లలకు రెండు ఎకరాల చొప్పున భూమి, కుమార్తెకు ఇంటి స్థలం ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఆస్తులు ఇవ్వాలని పలుమార్లు కృష్ణ మహేష్‌ను అడగడంతో ఇద్దరు మగ పిల్లలకు మాత్రమే భూమి ఇస్తానని, కుమార్తెకు ఏమీ ఇవ్వనని మహేష్ అనడంతో కొంత గొడవ జరిగింది. ఈ సమయంలో మహేష్ మీ అక్క లక్ష్మిని చంపినట్లు నిన్ను కూడా చంపుతానని కృష్ణను బెదిరంచాడు. దీంతో కృష్ణ పక్కా ప్లాన్‌తో తాగినమైకంలో ఉన్న మహేష్ (38)ను కత్తితో పొడిచి, తనకు తెలిసిన ఓ బాలుడితో కలిసి మృతదేహాన్ని ఆటోలో వేసుకుని కృష్ణానది వద్దకు తీసుకొచ్చారు. మృతదేహాన్ని నదిలో వేద్దామని నిర్ణయించుకున్నారు. హత్య చేసిన కత్తిని నదిలో వేసి, మృతదేహాన్ని వేసేందుకు ప్రయత్నించే సమయంలో కుదరకపోవడంతో బ్రిడ్జిపైనే వదిలి వెళ్లారు. ఈ విషయంలో పోలీసులు కేసును ఛేదించి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

బిజినేపల్లి యువకుడికి 5 ప్రభుత్వ ఉద్యోగాలు



జీవన్‌కుమార్

నాగర్‌కర్నూల్: మండల కేంద్రానికి చెందిన మాకం ఆంజనేయులు, లావణ్య దంపతుల కుమారుడు జీవన్‌కుమార్ ఒకేసారి 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఈ ఐదు ఉద్యోగాలు కూడా గెజిటెడ్ హోదావే కావడం గమనార్హం. జీవన్‌కుమార్ పాఠశాల విద్యను బిజినేపల్లి మండల కేంద్రంలోనే పూర్తిచేశారు. ఇంజనీరింగ్ విద్యను హైదరాబాద్‌లో చదివారు. ఆ తర్వాత పలు పోటీపరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ సంవత్సరం నిర్వహించిన పరీక్షల్లో అసిస్టెంట్ ఇంజనీరింగ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్, పాలిటెక్నిక్ లెక్చరర్, స్టాఫ్ సెలెక్షన్ జూనియర్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ ఉద్యోగాలు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నల్లమలకు 51 మందిరాలు మంజూరు



అచ్చంపేట: శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి కృషితో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో నల్లమలకు 51 మందిరాలు మంజూరు చేశామని దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ అంజనీదేవి అన్నారు. శుక్రవారం ఆయా దేవాలయాల ఆలయ కమిటీలతో అచ్చంపేట మండలం పలకపల్లి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చెంచుగూడెలతో పాటు వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో నిర్మాణం కానున్నట్లు చెప్పారు. ఆలయాలను త్వరితగతిన నిర్మాణం చేసుకోవడంలో ఆలయ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇందుకోసం అన్ని ఆలయాల కమిటీలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, జాయింట్ అకౌంట్స్ తెరవాలన్నారు. ఆలయాలు ప్రజలకు శాంతిని ఆధ్యాత్మిక చింతన కలిగించడం ద్వారా మరింతగా ప్రశాంత వాతావరణంలో జీవించవచ్చన్నారు. మాజీ జెడ్పీటీసీ డాక్టర్ చిక్కుడు అనురాధ, ఎస్ఎస్ఎఫ్ ఏపీ రాష్ట్ర కోశాధికారి శ్రీమాన్ విష్ణు, వికాస తరంగిణి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రఘునందర్, సెంట్రల్ కమిటీ కోశాధికారి అశోక్‌రావు, భవాని ప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేటలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

- పాలమూరు ఎంపీ డీకే అరుణ



డీకే అరుణను సన్మానిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ

పాలమూరు: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో శుక్రవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు మాట్లాడే అవకాశం దక్కింది. నారాయణపేటలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపై కేంద్రం చొరవ చూపాలని కోరారు. కేంద్రం మంజూరు చేసినా.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. స్కూల్ ఏర్పాటుకు జిల్లాలోని ఎక్లాస్‌పూర్ సమీపంలో 50 ఎకరాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని.. నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు.

❒ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై కేంద్రం నూతనంగా ఏర్పాటు చేసిన జేపీసీలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను సభ్యురాలిగా నియమించింది. తెలంగాణ నుంచి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో పాటు డీకే అరుణకు అవకాశం లభించింది.

❒ మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నికైన డీకే అరుణ ఢిల్లీలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీకే అరుణను ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు.

క్రూరమృగాల నుంచి రక్షణ కల్పించండి



మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బహదూర్

నాగర్‌కర్నూల్: అడవికి దగ్గరగా నివసించే గిరిజనులకు క్రూర మృగాల నుంచి రక్షణ కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బహదూర్ అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఆదేశానుసారం 'ప్రొటెక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ట్రైబ్స్ రైట్స్' పై బిజినేపల్లి మండలంలోని పెద్దతండాలో సదస్సు నిర్వహించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా స్థానికంగా చిరుత సంచారం ఎక్కువగా ఉందని.. దాని దాడిలో పశువులు చనిపోతున్నాయని పలువురు వివరించారు. కాగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి శుక్రవారం ఆదేశించారు. ఇళ్లు లేని వారికి స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వాలని తహసీల్దారు శ్రీరాములుకు సూచించారు. డీఎంహెచ్‌ఓ సహకారంతో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారంభించారు. క్రిమినల్ కేసుల్లో.. ఆర్థిక స్థోమత లేనివారు జిల్లా న్యాయ సేవా కేంద్రాన్ని సంప్రదిస్తే ఉచితంగా ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని అన్నారు. ఒక బాధితురాలు అందించిన దరఖాస్తు పరిశీలించి అప్పటికప్పుడు పిటిషన్ కేస్ నంబర్ కేటాయించారు. ఈ నెల 24కు వాయిదా ఇచ్చారు. న్యాయమూర్తి సబిత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, సీఐ కనకయ్యగౌడు, న్యాయవ్యాదులు శ్యాంప్రసాద్‌రావు, రాంచందర్, శ్రీరాం ఆర్యా, బిజినేపల్లి ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి, ఫారెస్ట్ అధికారి చింటు తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి జైలు శిక్ష

గద్వాల క్రైం: యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. గద్వాల పట్టణంలోని నదిగ్రహారంకు చెందిన బోయ కృష్ణ డిసెంబర్ 2, 2020 నాడు అదే గ్రామంలో మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతి వద్దకు పెళ్లి చేసుకోవల్సిందిగా ఒత్తిడి తీసుకువచ్చాడు. లేకుంటే చంపేస్తానని బెదిరించాడు. తల్లి వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన క్రమంలో నిందితుడు అక్కడే ఉండి తల్లిని సైతం బెదిరించాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రెండు రోజుల తర్వాత సదరు యువతి తనపై జరిగిన ఘటన గ్రామంలో తెలియడంతో తీవ్ర కలత చెంది వారి వ్యవసాయ పొలంలో చెట్టుకు చీరతో ఉరేసుకుంది. యువతి మృతికి కారణమైన నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. శుక్రవారం గద్వాల ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి గంటా కవిత సాక్షుల వాంగ్మూలం అనంతరం నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.12వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

గొర్రెల కాపరి హత్య కేసులో నిందితుల అరెస్ట్

భూత్పూర్: అడ్డాకుల మండలం కాటవరం చెందిన గొర్రెల కాపరి పాలెం కొల్లంపల్లి (40)ని హత్య చేసిన నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ రామకృష్ణ హత్యకేసు వివరాలను వెల్లడించారు. అడ్డాకుల మండలం కాటవరం చెందిన కొల్లంపల్లి కొన్ని రోజులుగా అదే గ్రామానికి చెందిన పాలెం మన్యంకొండ భార్యకు సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు పెడుతూ, ఫోన్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. పలు మార్లు మన్యంకొండ హెచ్చరించినా కొల్లంపల్లిలో మార్పు రాలేదు. మన్యంకొండ భార్య ఈనెల 3న చెప్పాపెట్టకుండా ఇంటినుంచి వెళ్లిపోయి చిన్నమ్మ గ్రామమైన భూత్పూర్ మండలం తాటిపర్తికి వచ్చింది. చిన్నమ్మ కుమారుడైన నాగరాజు, అతని కుమారుడు కిరణ్‌కుమార్, మహబూబ్‌నగర్ మండలం ఓబ్లాయిపల్లికి చెందిన మన్యంకొండ బావ మరుదులైన కురుమూర్తి, ఆంజనేయులు ఈ నెల 5న తాటిపర్తికి రావాలని కొల్లంపల్లికి చెప్పినా రాలేదు. దీంతో ఆగ్రహించి 6వ తేదీన వీరందరితోపాటు పాటు కోటకద్రకి చెందిన రాజుతో కలిసి అడ్డాకుల మండల కాటవరంకు వచ్చి కొల్లంపల్లి ఇంటికి వెళ్లగా, ఇంట్లో లేకపోగా పొలం వద్దకు వెళ్లారు. పొలం వద్ద కొల్లంపల్లి, వీరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. వీరందరూ కలిసి కొల్లంపల్లిని బలంగా కొట్టడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసును విచారణ చేశారు. పాలెం మన్యంకొండ భార్యను మానసికంగా హింసించడం భరించలేక దాడి చేయగా కొల్లంపల్లి మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. మన్యంకొండ, కిరణ్ కుమార్, నాగరాజు, అంజిలమ్మ, రఘునందన్, శివకుమార్, రాజేశ్, కురుమూర్తి, ఆంజనేయులు, రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణ పేర్కొన్నారు.

మొక్కలతోనే ప్రకృతి పరిరక్షణ



జడ్చర్ల: మానవాళి మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యమని, చెట్లు లేకపోతే భవిష్యత్‌లో మరింత దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని జోగుళాంబ గద్వాల రేంజ్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. శుక్రవారం జడ్చర్ల పోలీస్ శిక్షణ కేంద్రంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించుకునేందుకు అందరు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ చెట్లు, అడవులు లేకపోతే వర్షాలు కురువక, పంటలు పండక అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశ రక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దేశానికి సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేలా పని చేస్తోందని.. దేశ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆల్ ట్రేడ్ యూనియన్స్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.లక్ష్మయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని.. నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు వంత పడుతోందన్నారు. దేశ సంపదను విదేశీ సంస్థలు, కార్పొరేట్లకు దోచిపెడుతూ లూటీ చేస్తోందని ఆరోపించారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకునే బాధ్యత ఉందన్నారు. ఈ నెల 9 నుంచి 14 వరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు చంద్రకాంత్, రాజ్‌కుమార్, నర్సింహ, ఆనంద్, ఐఎన్‌టీయూసీ నాయకులు మహేశ్, కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు హన్మంతు, సీఐటీయూ వనపర్తి జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు మల్లేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ ఢీకొని 13 గొర్రెలు మృతి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం రోడ్డు దాటుతున్న గొర్రెలను సిమెంట్ లారీ ఢీకొనడంతో 13 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 30 గాయాలపాలయ్యాయి. సాతాపూర్ సమీపంలో కొనసాగుతున్న పాలమూరు-రంగారెడ్డి సొరంగం పనులకు కోదాడ నుంచి నిత్యం సిమెంట్ వస్తోందని.. డ్రైవర్ శ్రీను అజాగ్రత్తగా నడపడంతోనే గొర్రెలు మృతిచెందాయని కాపరులు శారద మల్లయ్య, గోపాల చిన్నబాలయ్య తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR SALE

■ 1.65 acres of Land on Sale at Neppalli, A.P.2KM from Davuluru toll, 600 m from NH 65,4KM from Kankipadu ✆ 83099 87010

SERVICES

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342

WANTED

■ ఎలాన్ హోండా షోరూమ్‌లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మరికల్ ఏరియాలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సర్వీస్ అడ్వయిజర్స్, టెలికాలర్స్, మెకానిక్స్, హెల్పర్స్ కావలెను. ఆఫీసు సమయం 9:30 AM to 7:00 PM Contact : 8498056136

■ త్రివేణి హోమ్స్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం 18K ఫోన్: 9160900024, 9840400073

భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించకుండా ప్రత్యుత్పన్నమతితో జాగ్రత్తగా వ్యవహరించాలని సాక్షి మేనేజ్‌మెంట్ సూచిస్తున్నది. ప్రకటనకర్తల సమాచారాన్ని ధృవీకరించిన తర్వాతనే పాఠకులు నిర్ణయం తీసుకోవాలని గమనించగలరు. - సాక్షి మేనేజర్

జూరాలకు వరద జోరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద జోరు తగ్గడం లేదు. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో 20 రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతుంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో శుక్రవారం స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం ప్రాజెక్టుకు 3,15,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గురువారం సాయంత్రానికి 2,96,000 క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 39 క్రస్టు గేట్లను ఎత్తి 2,68,593 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 69, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 717, ఎడమ కాల్వకు 820, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 150, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,91,936 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 2,06,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 1.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 110.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 25 గేట్లను ఎత్తి 1,29,750 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 28.048 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

89 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి నిలకడగా కొనసాగుతుంది. ఇప్పటి వరకు 89.258 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. శుక్రవారం ఎగువలోని కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 22,672 క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు వదులుతున్నామని తెలిపారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. శుక్రవారం 65,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 14గేట్లు తెరిచిన 62,706 క్యూసెక్కులను దిగువకు, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం కొనసాగుతుంది. శుక్రవారం 1,021అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వెయ్యి, వివిధ లిఫ్టుల ద్వారా 858, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

ఆర్డీఎస్‌లో నిలిచిన నీటి సరఫరా



రామాపురం సమీపంలో ఆర్డీఎస్ ప్రధాన కాల్వవలో నిలిచిన నీటి ప్రవాహం

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్‌కు ప్రాణాధారమైన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పంప్‌ను నిలిపివేయడంతో నీటిసరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. వడ్డేపల్లి మండల పరిధిలో ప్రవహించే ఆర్డీఎస్ కెనాల్‌కు నీరందించేందుకు తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్‌ను మంగళవారం ఆన్ చేశారు. ఒక్క రోజు మాత్రం కెనాల్ నిండుగా ప్రవహించింది. దీంతో ఆయకట్టు రైతులు వరి, మిరప నాట్లు వేసుకుందామని సమాయత్తమయ్యారు. అంతలోనే సరఫరా నిలిపివేశారు. తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్‌ను బంద్ చేశారు. బుధవారం రాత్రి నుంచి ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిసరఫరా నిలిచిపోయింది. ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ కర్ణాటక నుంచి విడుదలవుతున్న నీరు డి-23 వరకే వస్తున్నాయని, దిగువన వున్న డి-23 నుంచి డి-40 వరకు నీళ్లు అవసరమని రైతులు చెబుతున్నారు. నాట్లు వేసుకోవాలంటే నీళ్లు కావాలని, ఆర్డీఎస్ అధికారులు స్పందించి వెంటనే నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఈవిషయమై ఈఈ విజయ్‌కుమార్ రెడ్డిని వివరణ కోరగా వర్షం పడినందువల్ల నీళ్లు అవసరం లేదని రైతులు చెప్పారని అన్నారు. అంతేగాక వల్లూరు వద్ద కెనాల్ కోతకు గురైనందున తుమ్మిళ్ల మోటార్‌ను బంద్ చేశామని వివరించారు. మరమ్మతు చేయడానికి నాలుగు రోజులు పడుతుందన్నారు. ఆ తరువాత నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు.